క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ

మఠంపల్లి : మండలంలోని అవిరేణికుంటతండా, భీమ్లాతండా, పెదవీడు, కాల్వపల్లితండాల్లో పోలింగ్ కేంద్రాలను సోమవారం మండల సెక్టార్ అధికారి, ఎంపీఓ ఆంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, వీల్ చైర్లు, ర్యాంపు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం బీఎల్ఓలు, కార్యదర్శులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, పుణ్యేశ్వరి, బీఎల్ఓ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని రేపాలలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మొగిలిచర్ల పుల్లయ్య –కోటమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మొగిలిచర్ల రమేష్ రెండు సీలింగ్ ఫ్యాన్లను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాత మొగిలిచర్ల రమేష్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని హెచ్‌ఎం కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు కృషిచేస్తా : ప్రసాద్



కటికం శ్రీనును పరామర్శిస్తున్న కేఎల్‌ఎన్ ప్రసాద్

మోతె : మండలంలోని కరక్కాయలగూడెంలో తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయాలపాలైన గీత కార్మికుడు కటికం శ్రీనును సోమవారం కౌండిన్య గౌడ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ పరామర్శించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు కృషి చేస్తామని శ్రీనుకు హామీ ఇచ్చారు. ఆయన వెంట కటికం బాలకృష్ణ, కటికం శ్రీను, దుశ్చర్ల మహేష్, అంబాల దుర్గయ్య, కటికం రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మందులు అందజేత

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ వారు సీఎస్‌ఆర్ ఫండ్ కింద సోమవారం రెండు లక్షల రూపాయల విలువైన మందులను మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైహోం పరిశ్రమ అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో విశిష్ట పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, కొండారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

పోటు రమేష్‌బాబు ఆశయ సాధనకు కృషి చేయాలి



రమేష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : సీపీఎం సీనియర్ నాయకుడు పోటు రమేష్‌బాబు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో పోటు రమేష్‌బాబు 12వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పూర్ణచందర్‌రావు, పోటు పద్మ, కృష్ణబాబు, సింధూ, తిరగమళ్ల కిరణ్, కట్టా అశోక్, పగడాల శ్రీనివాస్, బాలశౌరి, నవీన్ చారి, మట్టయ్య, సైదులు, ప్రభాకర్, రాజశేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రాలు

- గ్రామాల్లో రెచ్చిపోతున్న దొంగలు
- చోరీకి గురవుతున్న విద్యుత్ మోటార్లు
- సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

చిలుకూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయక నిరుపయోగంగా మారాయి. మొదట్లో దాతల సహకారంతో లక్షల రూపాయలతో పోలీసులు ఎంతో ఆర్భాటంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ నాటి నుంచి వాటి నిర్వహణను పట్టించుకోవడం మరవడంతో అవి పూర్తిస్థాయిలో పనికి రాకుండా పోతున్నాయి. మండల కేంద్రమైన చిలుకూరులో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారితో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలు, బేతవోలు గ్రామంలో 25, జెర్రిపోతులగూడెంలో 12, పోలేనిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలు పని చేయడం లేదు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు తాము డబ్బులు ఇచ్చామని, కొన్ని రోజులు పని చేశాయని ఆ తరువాత వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని దాతలు చెబుతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు..

అయితే గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. గ్రామాలతో పాటు ప్రధాన రహదారుల వెంట కూడా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కాలువ ఎస్‌ఎస్‌పీ, ముక్త్యాల కాలువ, ఆర్‌కే మేజర్ కాలువలపై ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్నారు. ఇటీవల కాలంలో సుమారుగా 15కు పైగా విద్యుత్ మోటార్లు దొంగతనానికి గురయ్యాయి. అయితే రోడ్లపై నిఘా నేత్రాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారింది. సీసీ కెమెరాలు ఉంటే దొంగతనానికి సంబంధించి సాక్ష్యాలు అయినా దొరికేవి అని బాధితులు అంటున్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి ఆధారాలు లభ్యం కావడం లేదు. కావున గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని, పలు గ్రామాల్లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



సీసీ కెమెరాలకు తక్షణమే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఎన్నికలు పూర్తయిన తరువాత గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తాం. చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలు పని చేసేలా చూస్తాం.

– ఎస్. రాంబాబు గౌడ్, ఎస్ఐ, చిలుకూరు

ఎంపీగా గెలిపిస్తే ప్రజా గొంతుకనై ప్రశ్నిస్తా



హుజూర్‌నగర్ : ప్రచార కరపత్రం ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్

- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్

హుజూర్‌నగర్ : తనను ఆశీర్వదించి నల్లగొండ ఎంపీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి ప్రజా గొంతుకనై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని స్వతంత్ర అభ్యర్థి, ప్రజాస్వామ్య ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిరుద్యోగులతో కలిసి ఎన్నికల ప్రచార కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొంత మంది వ్యక్తులు, కుటుంబాల చేతుల్లో బందీ అయిందని ఆరోపించారు. కుల, వర్గ రాజకీయాలను అన్ని పార్టీలు పెంచి పోషిస్తున్నాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం ప్రజలకు ఓటు హక్కు కల్పించిందని, దానిని డబ్బు, మద్యానికి, అమ్ముకోకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని తెలిపారు.

నిజాయితీ పరులను ఎన్నుకోవాలి

కోదాడ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిజాయితీ పరులను ఎన్నుకోవాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. సోమవారం కోదాడలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తనను గెలిపిస్తే నల్లగొండ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : 11 కేవీ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున మునగాల మండల పరిధిలోని ఆకుపాముల, రేపాల సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ ఫీడర్లకు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గోండ్రియాల సబ్‌స్టేషన్ పరిధిలో..

అనంతగిరి : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున అనంతగిరి మండలంలోని గోండ్రియాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గోండ్రియాల, కొత్తగూడెం, శాంతినగర్, లక్కవరం గ్రామాల్లో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కీర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండ గ్రామంలో శ్రీశీతల పరమేశ్వరి, బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ, కోటమైసమ్మ, పోతరాజు, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజారులు శ్రీనివాసశర్మ, ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణ శర్మ, జొన్నపట్ల కిషోర్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేడుకలకు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు ఆయన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : గానుగబండలో బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



కోదాడరూరల్ : రెడ్లకుంటలో లింగమంతులస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రెడ్లకుంటలో లింగమంతులస్వామి ఆలయం..

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంటలో నూతనంగా నిర్మించిన శ్రీగంగాపార్వతీ సమేత లింగమంతులస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చల్లా గోపయ్యశాస్త్రి, కొంకపాక రాధాకష్ణమూర్తి నేతృత్వంలో అంబికా పంచాయతన, పూర్వక చండీయాగ మహోత్సవం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగవరపు లక్ష్మణ్‌రావు-సుజాత దంపతులు రూ.5లక్షలతో భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కనగాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు వేలమందికి మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మాజీ సర్పంచ్ సాధినేని లీలా అప్పారావు, గంగవరపు లక్ష్మణరావు, కనగాల నాగేశ్వరరావు, రమాదేవి, ఆలయ కమిటీ చైర్మన్ అమరబోయిన వెంకటేశ్వర్లు, చిర్రా సైదులు, నరసింహారావు, సత్యనారాయణ, శ్రీను, వీరయ్య, గురుపప్రసాద్ తదితరులు ఉన్నారు.



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌రావు తదితరులు

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్ : అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ ఎస్ఐ ఏ. రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన కుమ్మరికుంట్ల రాము(44) హోటల్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను డయాబెటిస్, కడుపునొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివా రం రాత్రి అతడు వివిధ రకాల మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది, ప్రజలు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు కాగిత రామచంద్రాపురం పల్లె దవాఖానాలో సోమవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. దగ్గు, బరువు తగ్గడం, జ్వరం రావడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. ఎవరిలోనైనా ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆశా కార్యకర్తలను సంప్రదించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేంద్ర, సుభాషిని, మహేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



హుజూర్‌నగర్ : సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రామిక భవన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో దోపిడీ, పీడన, అసమానతలు నేటికీ తీవ్రస్థాయిలో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రమాదకర శక్తులను ప్రజలు ఓడించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.చంద్రం, పి.లక్ష్మయ్య, అజయ్, నవీన్, నరసింహారావు, చందర్‌రావు, అంజయ్య, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : వెలిదండలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా

గరిడేపల్లి : పేద ప్రజలకు నిలిచేది ఎర్రజెండా అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకరావు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ.. భూమి, భుక్తి వెట్టిచాకిరి విముక్తి కోసం పేద ప్రజల పక్షాన నిలబడి కలబడిన కమ్యూనిస్టు పార్టీ త్యాగం అజేయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, శ్రీను, మాశెట్టి అంజయ్య, చనగాని పెద్ద సాంబయ్య, సూర్యం, శ్రీహరి, లక్ష్మయ్య, పర్వతాలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, చైత్రశుద్ధ చతుర్దశి, వాత్తుమరై, ఉపదేవ రచనమాల, మంగళాశాసనం, విశ్వక్సేన, పుణ్యాహవచనం, ధ్వజపతన విన్యాసం, రక్షాబంధనం, ఆంకురార్పణ, మత్స్య గ్రహణం అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు ముడుంబై పవన్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ విజయయాత్ర

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించబోయే వీర హనుమాన్ విజయ యాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి నల్లగొండ జిల్లా విభాగ్ కార్యదర్శి గంజి సుధాకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎస్‌ఎస్‌పీ క్యాంపులో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా సహ కోశాధికారి వెంకన్న, రాంకుమార్, మిర్యాలగూడ నగర కార్యదర్శి శ్రీనివాస్, ప్రవీణ్, కిరణ్‌రాజు, నరేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాంప్రసాద్, ప్రసాద్, జనార్దన్, లక్ష్మమ్మ, రవి, ఆలయ అర్చకులు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం : ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్యయాదవ్

నడిగూడెం : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు 420 హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేస్తోందని, ఆరు గ్యారంటీ పథకాలు ఎటు పోయాయని ప్రశ్నించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త ఖడ్గం సతయ్య గౌడ్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం నడిగూడెంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బ డేటి చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నాయకులు అనంతుల ఆంజనేయులు, చంద్రయ్య, వీరస్వామి, వెంకటరెడ్డి, సుధాకర్, ఖలీల్, జలీల్, పాల్గొన్నారు.

ప్రజలను కాంగ్రెస్ నట్టేట ముంచింది: సత్తయ్య



మునగాలలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్యగౌడ్

మునగాల : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కటికం సత్తయ్య గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. పార్టీ చేరికల మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో లేదని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషిచేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, కోల ఉపేందర్, ఎలక వెంకటరెడ్డి, తొగరు సీతారాములు, వి.రామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్డు షోను జయప్రదం చేయాలి

మోతె : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24వ తేదీన మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొనే రోడ్డు షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. సోమవారం మోతె మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, ఏలూరి వెంకటేశ్వరరావు, ముప్పాని శ్రీధర్‌రెడ్డి, నూకల శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసుదన్‌రెడ్డి, కండక్టర్ వెంకన్న, మిక్కిలినేని సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యం



మఠంపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి

మఠంపల్లి : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓ.నరసింహారెడ్డి కోరారు. సోమవారం మఠంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈనెల 27న స్థానికంగా నిర్వహించబోయే కంచర్ల కృష్ణారెడ్డి రోడ్‌షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీలు బానోతు జగన్‌నాయక్, కొప్పుల సైదిరెడ్డి, కోలాహలం కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, రామచంద్రయ్య, హఫీజ్‌ఖాన్, సాముల పుల్లారెడ్డి, కోటానాయక్, నాగయ్యయాదవ్, బాలునాయక్, లక్ష్మణ్‌నాయక్, జాల కిరణ్‌యాదవ్, కొమ్ము సైదులు, ఎంపీటీసీలు సైదమ్మ, జ్యోతి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేస్తున్న 1వ వార్డు ప్రజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామ ప్రత్యేక అధికారి, మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. 1వ వార్డులో గత నెల రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిందని, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి, మిషన్ భగీరథ ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.ప్రసాద్, ప్రభాకర్, వెంకన్న, బాలరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నడిగూడెం : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు చల్లా సతీష్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల ఎన్నికల ఇన్‌చార్జి బండారు కవిత, మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు పాల్గొన్నారు.

గంగయ్య మృతి బాధాకరం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేణుయాదవ్

మునగాల : మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు గడ్డం లింగయ్య తండ్రి గంగయ్య మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ అన్నారు. గంగయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం గ్రామంలో ఆయన చిత్రపటానికి వేణుయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గంగయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి

పాలకవీడు : మే 1వ తేదీన మండల వ్యాప్తంగా సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. ధనుంజయనాయుడు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పాలకవీడులో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జానయ్య, వెంకన్న, చిలకరాజు శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుడి షష్టిపూర్తి మహోత్సవం



ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మాతంగి ప్రభాకర్ షష్టిపూర్తి మహోత్సవాన్ని సోమవారం పాఠశాలల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జయవాణీదేవి, ఉపాధ్యాయులు.. ప్రభాకర్ దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీఈదేవి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, దీనారాణి, శేషగిరి, అస్మాముబీన్, శైలజ, అన్వేష్, అరుణారాణి, వసంతరావు, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు

పాలకవీడు : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ వసుంధర మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటాపాటల ద్వారా వారు చదువుకు ఆకర్షితులయ్యేలా విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులను ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.